సాక్షి
నిజామాబాద్

మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023



సత్వరమే పరిష్కరించాలి
ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు.
- 8లో ▸



చిరుద్యోగులపైనే ప్రతాపం
ట్రాన్స్‌కోలో చిరుద్యోగులపైనే చర్యలు తీసుకునే అధికారులు డీఈ స్థాయి అధికారి అవినీతికి పాల్పడినా స్పందించట్లేదు.
- 10లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
26.9 /22.7
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం నుంచి చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం మోస్తరు నుంచి భారీ వర్షం పడే సూచనలున్నాయి.

న్యూస్‌రీల్

పంటలకు జీవం
● వర్షాలతో గట్టెక్కిన సోయా, పత్తి, మక్క

డొంకేశ్వర్(ఆర్మూర్) : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు పంటలకు ప్రాణం పోశాయి. నీళ్లు లేక వాడుతున్న సోయా, పత్తి, మక్క, పప్పు దినుసుల పంటలు గట్టెక్కాయి. ఖరీఫ్ సీజన్‌కు గాను జిల్లాలో 50,187 ఎకరాల్లో సోయా సాగైంది. ఇందులో దాదాపు సగం వరకు వర్షాధార పంట ఉంటుంది. అలాగే పత్తి 2,670 ఎకరాల్లో సాగవ్వగా, ఆరుతడి పంటలైన మక్క 38,411 ఎకరాల్లో, కంది 1,057, పెసర 32, మినుము 71, వేరు శనగ 185 ఎకరాల్లో సాగైంది.

గోమాతకు వైద్యసేవలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నగరంలోని వినాయక్‌నగర్ అభయాంజనేయ స్వామి ఆలయం సమీపంలో అపస్మారక స్థితిలో ఉన్న ఆవు దూడకు విశ్వహిందూ పరిషత్ జిల్లా సహాయ కార్యదర్శి ధాత్రిక రమేశ్ ఆధ్వర్యంలో సోమవారం సేవలందించారు. పశువైద్యులు శ్రీనివాస్, నవీన్‌ను పిలిపించిన రమేశ్ దూడ గాయాలకు తగిన విధంగా చికిత్స చేయించి దూడకు మేతను వేశారు. దీంతో దూడ కోలుకుంది.హిందూవాహిని ప్రతినిధి అర్జున్‌రెడ్డి, గోసేవకులు ప్రణవ్, సాకేత్, రాజు యాదవ్, సందీప్ పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రిని కలిసిన ఎంపీ అర్వింద్



సుభాష్‌నగర్ : కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను ఎంపీ అర్వింద్ ధర్మపురి ఢిల్లీలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ క్లీన్‌స్వీప్ కోసం వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. ఎంపీకి అమిత్ షా కీలకమైన సలహాలు, సూచనలు చేశారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను ఎంపీ అర్వింద్ వివరించారు. అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాలను తెలియజేశారు.

మెడికల్ కళాశాలలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

నిజామాబాద్ నాగారం : ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పోస్టుల భర్తీకి ఈనెల 6 నుంచి 12 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఇందిర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న అదనపు కలెక్టర్ కార్యాలయంలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా 5 ఉన్నాయని, ఎండీ, ఎంస్, డీఎన్‌బీ పీజీ, ఎనిమిదేళ్ల అనుభవం ఉండాలని, వేతనం రూ.1.50లక్షల పైన ఉంటుందన్నారు. అ.ప్రొఫెసర్ పోస్టులు ఖాళీలు 5 ఉన్నాయని, ఎండీ,ఎంఎస్, డీఎన్‌బీ పీజీ కోర్సు, ఒక ఏడాది సీనియర్ రెసిడెన్సీగా అనుభవం ఉండాలని, వేతనం రూ. 1,25,000 ఉంటుందన్నారు. జూ.రెసిడెంట్ పోస్టులు 18 ఖాళీలు, అర్హతలు ఎంబీబీఎస్ డిగ్రీతో పాటు మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ అయి ఉండాలని, వేతనం రూ.37,284 ఉందన్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు 7 ఉండగా, ఎంబీబీఎస్ డిగ్రీతోపాటు ప్రభు త్వ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలి. వేతనం రూ.52,000 ఉందన్నారు. ట్యూటర్ల పోస్టులు 14 ఖాళీగా ఉండగా వేతనం రూ.55,000 ఉంటుందన్నారు.

నిజాంసాగర్ 5 గేట్ల ఎత్తివేత



నిజాంసాగర్ : ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీ ఇన్‌ఫ్లో వస్తోంది. సోమవారం 40 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని అధికారులు తెలిపారు. పోచారం ప్రాజెక్టులో అలుగు పారుతుండడంతో ఆ ప్రాజెక్టు ద్వారా 30 వేల క్యూసెక్కుల నీరు నిజాంసాగర్‌లోకి వచ్చి చేరుతోందన్నారు. దీంతో నిజాంసాగర్ ప్రాజెక్టు 2, 3, 6, 8, 10 నంబర్ల గేట్లను ఎత్తి నీటిని వదులుతున్నారు.



రామడుగు ప్రాజెక్ట్ అలుగు పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరద



తెగిపోయిన రోడ్డు వద్ద మరమ్మతులు చేస్తున్న అమ్రాద్ తండావాసులు

ఎడతెరిపి లేని వాన

- రాష్ట్రంలోనే అత్యధికంగా మంచిప్పలో 157.5 మి.మీ వర్షపాతం
- మోపాల్ మండలంలో 147.9 మి.మీ నమోదు
- రూరల్ నియోజకవర్గంలో నిలిచిన రాకపోకలు
- నగరంలో పొంగిన పులాంగ్ వాగు
- స్తంభించిన జనజీవనం

జిల్లావ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో అన్నదాతల్లో సంతోషం వ్యక్తమవుతున్నప్పటికీ పలుచోట్ల ప్రజా జీవనానికి ఇబ్బందులు తప్పలేదు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మంచిప్పలో రాష్ట్రంలోనే అత్యధికంగా 157.5 మి.మీ వర్షపాతం నమోదైంది. పలుచోట్ల చెట్లు కూలాయి. అలుగులు పొంగిపొర్లాయి.



నందిపేట్-కుద్వాన్‌పూర్ గ్రామాల మధ్యన రోడ్డుపై నేలకొరిగిన చెట్టు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలోని నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని మోపాల్ మండలంలో గడిచిన 24 గంటల్లో అత్యధికంగా 147.9 మి.మీ వర్షపాతం నమోదు కాగా, ఈ మండలంలోని మంచిప్పలో మాత్రం రాష్ట్రంలోనే అత్యధికంగా 157.5 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇందల్వాయి మండలంలో 146.1 మి.మీ వర్షపాతం నమోదు కాగా, ఈ మండలంలోని గన్నారంలో మాత్రం రాష్ట్రంలో నాలుగో అత్యధిక వర్షపాతం 148.8 మి.మీ నమోదైంది. వర్షాల కారణంగా డిచ్‌పల్లి మండలం నడిపల్లి శివారులో హైదరాబాద్ రోడ్డుపై వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. సిరికొండ మండలంలో కప్పలవాగు ఉధృతంగా ప్రవహించడంతో గడ్కోల్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయాయి. కొండూర్ వద్ద రేకులపల్లి చెరువు అలుగు ఒర్రె కాజ్‌వే పైనుంచి పారింది. సిరికొండ నుంచి భీంగల్ వెళ్లే మార్గంలో దొండ్లవాగు వంతెనపై నుంచి ఉధృతంగా ప్రవహించింది. సిరికొండలో విద్యుత్ ఉప కేంద్రం నీటితో మునిగింది. రామడుగు ప్రాజెక్ట్‌లోకి భారీగా వరదనీరు రావడంతో అలుగుపై నుంచి నీరు ప్రవహిస్తోంది. ప్రాజెక్ట్‌లోకి 18,914 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. అంతేస్థాయిలో అవుట్‌ఫ్లో వెళ్తోంది. భారీ వర్షాలకు దమ్మన్నపేట, చల్లగరిగె గ్రామాల మధ్య తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. వాడి గ్రామం వద్ద వాగు లెవల్ వంతెనపై నుంచి నీరు పారుతుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మంచిప్ప నుంచి అమ్రాబాద్, బైరాపూర్‌లకు వెళ్లే రోడ్డు, ముదక్‌పల్లి నుంచి బాడ్సి వెళ్లే రోడ్డులోగల పిల్లవాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచాయి.

నిజామాబాద్ రూరల్ మండలంలోని పాంగ్రాలో లోతట్టు ప్రాంతాల్లోని నిర్వాసితులను సంఘ భవనానికి తరలించారు. మాధవనగర్ సాయిబాబా ఆలయంలోకి వరద నీరు చేరడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సిర్నాపల్లి, గన్నారం తదితర గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. జక్రాన్‌పల్లి మండలంలో పడకల్, జక్రాన్‌పల్లి పెద్ద చెరువులు అలుగులపై నీరు ప్రవహిస్తోంది.

■ బోధన్ డివిజన్‌లోని బోధన్, నవీపేట, రెంజల్, ఎడపల్లి, కోటగిరి, రుద్రూర్, వర్ని, మోస్రా, చందూర్ మండలాల్లో శుక్రవారం రాత్రి నుంచి చిరు జల్లులతో ముసురు వర్షం కురుస్తోంది. రెంజల్ మండల కేంద్రంలో వర్షానికి మూడు ఇళ్లు కూలిపోయాయి. బోధన్ మండలంలోని పసుపువాగులో స్వల్పంగా వరదనీరు పెరిగింది. కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లను ఎత్తి దిగువ మంజీర నదిలోకి నీటిని వదిలారు. డివిజన్‌లోని కోటగిరి, బోధన్ మండలంలోని మంజీర తీరం నదిలో వరదనీటి ఉధృతి పెరిగే అవకాశం ఉంది. మంజీర తీరంలోకి ఎవరూ వెళ్లకూడదని బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ తెలిపారు. వర్షం వల్ల వేలాది ఎకరాల్లో సాగు చేసిన సోయా పంట అధిక తేమ వల్ల నష్టం వాటిల్లే అవకాశాలున్నాయి.

■ శ్రీరాంసాగర్ జలాశయం పూర్తిగా నిండింది. 1,091 అడుగులు, 90 టీఎంసీల నీటితో నిండుకుండలా మారింది. ఇన్‌ఫ్లో 20 వేల క్యూసెక్కులు ఉండగా, 2 గేట్లు ఎత్తి 5,250 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు.

■ ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట జోర్‌పూర్ గ్రామాల మధ్యన గాలివానకు భారీ వృక్షం నేలకొరిగింది. డొంకేశ్వర్ మండలం తొండకూర్ వద్ద వర్షానికి మట్టి రోడ్డు మళ్లీ కొట్టుకుపోయింది.

■ నిజామాబాద్ నగరంలో ఆదివారం రాత్రి నుంచి భారీ వర్షం కురిసింది. ప్రధాన రోడ్లు, కాలనీలు జలమయమయ్యాయి. శివారు ప్రాంతాలు, డ్రైనేజీలు పొంగాయి. మున్సిపల్ అధికారులు సహాయ కార్యక్రమాలు చేపట్టారు. నగర శివారులోని గంగాస్థాన్ ఫేజ్-2 ప్రాంతంలో పులాంగ్ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగు పక్కన గుడిసెల్లోకి నీరు చేరింది. అధికారులు గుడిసెలు ఖాళీ చేయించి గూపన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలకు బాధితులను తరలించారు.

మండలాల్లో వర్షపాతం (మి.మీ)

వేల్పూర్	99.8	ఆలూరు	108.3	వర్ని	55.2	ఎడపల్లి	63.0
నవీపేట	99.8	డిచ్‌పల్లి	130.7	పోతంగల్	103.5	చందూరు	61.0
భీమ్‌గల్	78.9	ఏర్గట్ల	61.4	ఇందల్వాయి	146.1	నిజామాబాద్ రూరల్	74.5
జక్రాన్‌పల్లి	127.3	నందిపేట	59.1	ఆర్మూర్	79.5	రుద్రూర్	40.5
మోర్తాడ్	63.7	రెంజల్	84.1	ముప్కాల్	96.8	మోపాల్	147.9
కమ్మర్‌పల్లి	87.4	కోటగిరి	76.7	ధర్పల్లి	79.9	నిజామాబాద్ నార్త్	105.9
సిరికొండ	99.9	మెండోరా	75.6	బోధన్	55.5	మోస్రా	55.1
బాల్కొండ	105.4	మాక్లూర్	96.2	సాలూర	63.0	నిజామాబాద్ సౌత్	44.5

బాడ్సి మదాం చెరువుకు గండి



గండి పడడంతో దిగువకు వెళ్తున్న వరద

మోపాల్ : మండలంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి బాడ్సిలోని మదాం చెరువుకు గండిపడింది. విషయం తెలుసుకున్న స్థానిక ప్రజాప్రతినిధులు, జల వనరుల శాఖ అధికారులు గండిని పూడ్చేందుకు శ్రమించారు. అటవీ ప్రాంతాల నుంచి నీరు చెరువులోకి రావడంతో తూం వద్ద గండిపడింది. దీంతో ఆయకట్టు కింద ఉన్న సుమారు 30 ఎకరాల్లో మట్టిమేటలు వేయడంతో పంటకు నష్టం జరిగింది. నీరు కోనం చెరువులోకి చేరి బాడ్సి ముదక్‌పల్లి రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి. చెరువుకు గండిపడడంతో మంచిప్ప రోడ్డులో గల పలు ఇళ్ల మధ్యలోకి నీరు చేరింది.



నడిపల్లి వద్ద నిజామాబాద్-హైదరాబాద్ రహదారిపై నిలిచిన వరదనీరు



కొండాపూర్-కుద్వాన్‌పూర్ రోడ్డు తెగిపోగా పొలాల్లో నుంచి వెళ్తున్న రైతులు



మాధవనగర్ సాయిబాబా ఆలయంలోకి వచ్చిన నీరు

రైతులకు కొత్త పంట రుణాలివ్వాలి

- వీసీలో మంత్రి హరీశ్‌రావు
- సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని సమీక్షించిన సీఎస్ శాంతికుమారి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, మున్సిపల్ కమిషనర్


సుభాష్‌నగర్ : అన్నదాతకు ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు వీలుగా ప్రభుత్వం రూ. లక్షలోపు పంట రుణాల మాఫీ చేస్తోందని, రుణమాఫీ వర్తింపజేసిన రైతులకు తిరిగి కొత్తగా పంట రుణాలను మంజూరు చేయాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు సూచించారు. సోమవారం సాయంత్రం దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఇతర ఉన్నతాధికారులతో కలిసి మంత్రి హరీశ్‌రావు వీసీ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 42 లక్షల మంది రైతులకు ప్రభుత్వం రుణమాఫీ వర్తింపజేస్తున్నామన్నారు. మొదటగా రూ. లక్షా పది వేల లోపు పంట రుణాలు కలిగి ఉన్న వారికి రుణమాఫీ వర్తింపజేస్తున్నామని స్పష్టంచేశారు. ఇప్పటికే 18.79 లక్షల మంది రైతులకు రుణమాఫీ కింద రూ. 9,654 కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. బ్యాంక్ అకౌంట్లు రద్దు చేసుకోవడం, వినియోగంలో లేకపోవడం వంటి కారణాల వల్ల లక్షా 60 వేల మంది వరకు రుణమాఫీ డబ్బు జమ కాలేకపోయిందన్నారు. అయినప్పటికీ సదరు రైతుల ఆధార్ నెంబర్‌ను అనుసంధానం చేసుకుని పరిశీలించగా, 95,845 మందికి రైతుబంధు ఖాతాలు ఉన్నట్లు గుర్తించామని, వారికి రుణమాఫీ డబ్బులు త్వరలోనే ఖాతాల్లో జమ చేయిస్తామన్నారు. మిగితా సుమారు 48 వేల మంది రైతులకు సంబంధించి రుణమాఫీ కోసం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపించాలని కలెక్టర్లకు సూచించారు.

రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశంలో బ్యాంకర్లు సైతం కొత్త రుణాలిచ్చేందుకు అంగీకరిస్తూ స్పష్టమైన హామీనిచ్చారన్నారు. ఇప్పటికే ప్రభుత్వం 18 లక్షల పైచిలుకు మంది రైతులకు రుణమాఫీ వర్తింపజేయగా, వారిలో కేవలం 6.54 లక్షల మందికి మాత్రమే కొత్త రుణాలు అందించారన్నారు. ఈనెలాఖరులోపు నూరు శాతం రుణాలొచ్చేలా చొరవ చూపాలన్నారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆసరా పెన్షన్లు, కారుణ్య నియామకాలు తదితర కార్యక్రమాల ప్రగతిని జిల్లాల వారీగా సమీక్షించారు.

ఆసరా పింఛన్ లబ్ధిదారులు మృతి చెందితే..

ఆసరా పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులు మృతి చెందితే, వారి జీవిత భాగస్వామికి పెన్షన్ ఇచ్చే ప్రక్రియలో వేగం పెంచాలన్నారు. కారుణ్య నియామకాల ప్రక్రియను వేగంగా పూర్తిచేసిన సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వేగవంతంగా నియామకాల ప్రక్రియ పూర్తి చేయడంపై కలెక్టర్లను అభినందించారు. మొత్తం 1,266 పోస్టులకు గాను 1,095 నియామకాలు పూర్తి చేశారని, మిగితా నియామకాలను కూడా త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. వీసీలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం మకరంద్, డీఆర్డీవో చందర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వాజిద్‌హుస్సేన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దారిచూపే దిక్సూచి.. గురువు



తల్లి తండ్రి గురువు దైవంతో సమానం అంటారు. జన్మనిచ్చిన తల్లిదండ్రుల తర్వాత అంతటి గౌరవం గురువులకే దక్కుతుంది. దారిచూపే దిక్సూచి గురువు. సమాజంలో గురువులకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుంది. విద్యార్థి జీవితాన్ని ప్రభావితం చేసేది వారే. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఏటా సెప్టెంబరు 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటారు. అలాగే ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించుకుంటారు. రాష్ట్రస్థాయిలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉత్తమ అవార్డులకు ఎంపిక కాగా, జిల్లాస్థాయిలో 30 మంది అవార్డులకు ఎంపికయ్యారు. నేడు కలెక్టరేట్‌లో అవార్డుల ప్రదానం జరుగనుంది. – నిజామాబాద్ అర్బన్

- వివరాలు 8లో..

ఎస్సారెస్పీలోకి పోటెత్తిన వరద

- ప్రస్తుత ఏడాది మొదటిసారి ప్రాజెక్ట్‌లో పూర్తిస్థాయి నీటిమట్టం
- సోమవారం రాత్రి 16 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

బాల్కొండ: ఉత్తర తెలంగాణ జిల్లాల వర ప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల ఆదివారం సాయంత్రం నుంచి వరద నీరు పోటెత్తింది. 10,500 క్యూసెక్కులతో ప్రారంభమైన వరద నీరు గరిష్ఠంగా 51వేలకు చేరుకుంది. దీంతో ప్రాజెక్ట్ అధికారులు ప్రాజెక్ట్ వరద గేట్లు నాలుగు ఎత్తి దిగువకు 12,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. అంతకు ముందు ఎస్కేప్ గేట్ల ద్వారా 5 వేల క్యూసెక్కులు గోదావరిలోకి వదిలారు. వరద కాలువ ద్వారా 5వేల క్యూసెక్కుల నీటి విడుదలను ప్రారంభించారు. సక్రమంగా ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్ట్ నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదలను తగ్గించారు. రెండు గేట్ల ద్వారా నీటిని వదులుతున్నారు. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 3వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 628 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో పోతుంది. తాగునీటి అవసరాలకు మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగుల కాగా అంతే స్థాయి నీటిమట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉంది.

జూలై నుంచే..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి జూలైలోనే ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు ప్రారంభమైంది. కాని ప్రాజెక్ట్ అధికారులు ప్రాజెక్ట్ నీటి నిల్వ 75 టీఎంసీలకు చేరగానే ప్రాజెక్ట్ నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల చేపట్టారు. మళ్లీ వరద నీరు తగ్గడం, పెరగడంతో ప్రాజెక్ట్ నీటి నిల్వను 88.5 టీఎంసీల వరకు తీసుకెళ్లారు.

గతనెల రోజుల నుంచి అదే నీటినిల్వను ఉంచుతున్నారు. కాని పూర్తిస్థాయి నీటి నిల్వకు చేర్చలేదు. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్‌లోకి సెప్టెంబర్ మాసం సెంట్‌మెంట్ కావడంతో ప్రాజెక్ట్ అధికారులు వరదలు వస్తాయనే అంచన వేశారు. దీంతో ప్రస్తుతం వరద నీరు వచ్చిచేరుతుండటంతో ప్రాజెక్ట్ నీటి నిల్వ 90 టీఎంసీలకు చేర్చారు.



నిండుకుండలా ఉన్న ఎస్సారెస్పీ ప్రాజెక్ట్

రాత్రివేళ పెరిగిన వరద..

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి రాత్రి 8 గంటలకు మళ్లీ వరద నీరు 30 వేల క్యూసెక్కులకు పెరిగింది. క్రమంగా పెరుగుతూ 9 గంటల వరకు 62వేల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో ప్రాజెక్ట్ అధికారులు 16 వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి 50 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్ట్ సామర్థ్యం 90 టీఎంసీలు కాగా ప్రస్తుతం 89 టీఎంసీల నిల్వ ఉంది.

క్లుప్తంగా

అల్జాపూర్‌ శివారులో చిరుత సంచారం



నవీపేట: మండలంలోని అల్జాపూర్‌ శివారులో ఆదివారం రాత్రి చిరుత కనిపించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. రెండుసార్లు చిరుత కనిపించడంతో గ్రామస్తులు అటవీశాఖ అధికారులు సమాచారమివ్వడంతో సోమవారం చిరుత సంచరించిన ప్రదేశాన్ని సందర్శించారు. అటవీశాఖ నిజామబాద్‌ రేంజ్‌ ఆఫీసర్‌ పద్మారావు, సెక్షన్‌ ఆఫీసర్‌ జెహ్రా ఆధ్వర్యంలో ఫారెస్ట్‌ అధికారులు పాదముద్రలను సేకరించారు. వయసు పైబడిన చిరుత సంచరిస్తున్నట్లు వారు నిర్ధారించారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించాక బోను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఏడాది క్రితం ఇదే ప్రదేశంలో చిరుత కనిపించడంతో అటవీశాఖ అధికారులు బోను ఏర్పాటు చేయగా చిరుత చిక్కలేదు.

బదిలీలు చేపట్టాలని వినతి



ఖలీల్‌వాడి: ప్రొహిబిషన్‌, ఎక్సైజ్‌ హెడ్‌ కానిస్టేబుల్‌, కానిస్టేబుల్‌ బదిలీలు చేపట్టాలని ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా అసోసియేషన్‌ ప్రెసిడెంట్‌ రవికుమార్‌, ఆర్గనైజింగ్‌ సెక్రెటరీ భోజన్న, ప్రెస్‌ సెక్రెటరీ ఉత్తమ్‌ రాష్ట్ర ఎక్సైజ్‌ కమిషనర్‌ ముషార్రఫ్‌ పారుఖీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బాసర జోన్‌లోని ఎక్సైజ్‌ శాఖలో పదోన్నతులు కల్పించాలన్నారు. అలాగే చెక్‌పోస్ట్‌లలో సౌకర్యాలు కల్పించాలని కోరితే సానుకూలంగా స్పందించారని చెప్పారు.

గోదావరికి హారతి



రెంజల్‌: శ్రావణమాస ఉత్సవాలను పురస్కరించుకుని కేశవ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం గోదావరి గంగా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కందకుర్తి త్రివేణి సంగమం పుష్కర క్షేత్రం వద్ద గోదావరి నదికి హారతి ఇచ్చారు. వర్షం కురుస్తున్నా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సీతారాం త్యాగి మహారాజ్‌ ఆశ్రమంలో ముందుగా భక్తులు సమావేశమయ్యారు. అక్కడి నుంచి పుష్కర క్షేత్రం వరకు తరలి వెళ్లారు.

అంబేడ్కర్‌ నేషనల్‌ అవార్డుకు ఎంపిక

నిజామాబాద్‌నాగారం: దళిత సంఘర్షణ సమితి నిజామాబాద్‌ నగర అధ్యక్షుడు నాగరాజు అంబేడ్కర్‌ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. అవార్డు సెలెక్షన్‌ కమిటీ నేషనల్‌ చైర్మన్‌, బీఎస్‌పీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అవార్డు ఆహ్వాన పత్రాన్ని హైదరాబాద్‌లో సోమవారం అందజేశారు.

గురువులకు వందనం

- బోధనతో ఆదర్శంగా నిలుస్తున్న పలువురు ఉపాధ్యాయులు
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కథనం

గురువంటే చీకటిని తొలగించేవాడు. విద్యార్థికి జ్ఞానం అందించేవాడు. తాను నేర్చుకుంటూ శిష్యులకు బోధన చేసేవాడు. తన విద్యార్థులను ప్రయోజకులు చేసి ఆనందపడేవాడు. ఎందరో గురువులు బోధనలో వినూత్న పద్ధతులు పాటిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇలా జిల్లాలో పలువురు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కథనం..



చిత్రాల ద్వారా విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న నర్సయ్య

బోధనలో వైవిధ్యం

పెర్కిట్‌: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి బోధనోపకరణాలతో పాఠ్యంశాలను బోధిస్తూ ప్రశంసలు అందుకుంటున్నాడు ఆర్మూర్‌ మండలం మంథని ప్రభుత్వ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు సుద్దపల్లి మల్లేశ్‌. జీవశాస్త్రంలోని కఠినమైన అంశాలను విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునే విధంగా బోధనపకరణాలను ఉపయోగిస్తూ పాఠ్యంశాలను బోధిస్తున్నాడు. రక్త ప్రసరణ వ్యవస్థ, మెదడు నిర్మాణం, మానవ అస్థిపంజరం, జంతు కణం, కిడ్నీలు, మొక్కలలోని వివిధ భాగాలు, మానవ గుండె నిర్మాణం తదితర సుమారు 100 వరకు బోధనోపకరణాలను తయారు చేసి ప్రయోగాశాలలో భద్రపరిచాడు.



బోధనోపకరణాలతో ఉపాధ్యాయుడు మల్లేశ్‌

శాస్త్రీయ నైపుణ్యం పెంపొందుతుంది

బోధనోపకరణాలతో పాఠ్యంశాలు బోధిస్తే విద్యార్థులకు జీవితకాలం గుర్తుంటాయి. అలాగే విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాలు మెరుగు పడుతాయి. దీంతో పాటు ప్రయోగశాల అనుభవం విద్యార్థుల్లో పెరుగుతుంది. అలాగే విద్యార్థులు పరీక్షల్లో సొంతంగా సమాధానాలు రాసే సామర్థ్యం పెరుగుతుంది. – సుద్దపల్లి మల్లేశ్‌

విశ్రాంత జీవితంలో..



పాఠాలు చెబుతున్న సంజీవ్‌రెడ్డి

మాక్లూర్‌: ప్రధానోపాధ్యాయుడిగా 2016లో రిటైర్డ్‌ అయిన వేములపల్లి సంజీవ్‌రెడ్డి మళ్లీ విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. వేల్పూర్‌కు చెందిన సంజీవ్‌రెడ్డి కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా ఉంటూ 2016లో విరమణ పొందారు. ఆయన ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉంటూనే ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని అవార్డులు అందుకున్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో కీలక పాత్ర పోషించారు. ఎంతో మంది బడి బయటి పిల్లలను పాఠశాలల్లో చేర్పించారు. విద్యార్థులకు ఇంకా పాఠాలు బోధించాలనే లక్ష్యంతో 2017లో దాస్‌నగర్‌లోని తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా చేరారు. తన శైలిలో పాఠాలు బోధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

వృత్తిపై నిబద్ధతతో..



బోధన్‌: బోధన్‌లోని బీటీనగర్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆర్‌ వెంకటరమణగౌడ్‌ వృతిష్టపై నిబద్ధత పాటిస్తు ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారు. గతంలో పలు స్వచ్ఛంద సంస్థలు, మండల విద్యాశాఖ ద్వారా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యాశాఖ జిల్లా స్థాయి బెస్ట్‌ టీచర్‌ అవార్డుకు ఎంపిక చేసింది. పాఠశాల పాలన పరమైన విధులతో పాటు విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌లో పురోగతి, పరిసరాల స్వచ్ఛత, మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేశారు. ఈ పాఠశాలలో తెలుగు, ఉర్దూమీడియం 6 నుంచి 10 వరతగతి వరకు 360 మంది విద్యార్థులు, 15 మంది ఉపాధ్యాయులున్నారు. గతంలో తక్కువగా ఉన్న విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేశారు. 2013లో ఆయన హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించి పదేళ్ల నుంచి ఇక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు.

పాఠశాలకు కేంద్ర స్వచ్ఛ పురస్కారం

పాఠశాలకు కేంద్ర మానవ వనరుల శాఖ 2017, 2018లో స్వచ్ఛ పురస్కార ప్రదానం చేసింది. ఇందులో హెచ్‌ఎం కీలక పాత్ర వహించారు. తొలిసారిగా స్కూల్‌కాంప్లెక్స్‌ స్థాయి క్రీడలు నిర్వహించారు. హెచ్‌ఎం ఆర్‌వీఎస్‌గౌడ్‌ను మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

సులభంగా అర్థమయ్యేలా..

మోర్తాడ్‌: చిత్రాలను గీయడం, అందమైన బొమ్మలను తయారు చేయడం ఆయన ప్రవృత్తి. ఆ ప్రవృత్తితోనే ఇప్పుడు తన వద్ద చదువుకుంటున్న విద్యార్థులకు సులభమైన పద్ధతిలో పాఠాలను చెబుతూ వారి మస్తిష్కంలో ఎప్పటికి ఉండిపోయేలా కృషి చేస్తున్నాడు బాల్కొండ మండలం బస్సాపూర్‌ ఉపాధ్యాయుడు బోయిడ నర్సయ్య. చిన్నతనం నుంచి చిత్రకళపై పట్టు సాధించిన నర్సయ్య ఆ కళను విద్యార్థుల కోసం ఉపయోగిస్తున్నాడు. పాఠ్య పుస్తకాల్లో ఉన్న పాఠాలను అలాగే చెబితే విద్యార్థులకు సరిగా అర్థం కావని గుర్తించి తాను పని చేస్తున్న పాఠశాలలో దాతల సహకారంతో అన్ని గోడలకు చిత్రాలను గీశాడు. చిత్రాల ద్వారా పాఠాలు చెబితే మరచిపోవడానికి అవకాశం ఉండదని నర్సయ్య చెబుతున్నారు.



సులభ పద్ధతిలో బోధన కోసం బొమ్మలు తయారు చేస్తున్న నర్సయ్య

ఉపాధ్యాయులకు శిక్షణ

తన కళల ద్వారా పాఠాల బోధన ఒక్క తన పాఠశాలకే పరిమితం చేయలేదు. నర్సయ్య వాట్సాప్‌ గ్రూపులను క్రియేట్‌ చేసి టీచింగ్‌ లెర్నింగ్‌ మెథడ్‌(టీఎల్‌ఎం) అనే కార్యక్రమాన్ని ఎంతో కాలం నుంచి కొనసాగిస్తున్నాడు. మన రాష్ట్రంలోని ఉపాధ్యాయులతో పాటు పొరుగు రాష్ట్రంలోని ఉపాధ్యాయులతో మూడు వాట్సాప్‌ గ్రూపుల ద్వారా మూడు వేల మంది ఉపాధ్యాయులతో తన కళలను పంచుకుంటున్నాడు. సమగ్ర శిక్ష ద్వారా విద్యాశాఖ ఈ సంవత్సరం తొలిమెట్టు కార్యక్రమం ఆరంభించడం గమనార్హం. తొలిమెట్టుకు ముందుగానే నర్సయ్య తన ఆలోచనలను తన తోటి ఉపాధ్యాయులతో పంచుకుంటుండటం విశేషం. నర్సయ్య చేస్తున్న విద్యా సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం 2022 సెప్టెంబర్‌ 5న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తించి అవార్డును అందించారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు నర్సయ్య చేస్తున్న సేవలను గుర్తించి ఎన్నో అవార్డులు అందించాయి. ఉపాధ్యాయుల శిక్షణకు సంబంధించి జిల్లా రిసోర్స్‌ పర్సన్‌గా నర్సయ్య కొనసాగుతుండటం గమనార్హం.

విద్యుత్‌ తీగలపై పడిన చెట్టు

- విరిగిన నాలుగు స్తంభాలు
- నిలిచిపోయిన విద్యుత్‌ సరఫరా

రుద్రూర్‌: రుద్రూర్‌ మండలం రాణంపల్లి శివారులో సోమవారం కురిసిన వర్షానికి ఓ చెట్టు విరిగి 11 కేవీ విద్యుత్‌ తీగలపై పడింది. దీంతో నాలుగు విద్యుత్‌ స్తంభాలు నెలకొరిగాయి. ఈ ఘటనతో సమీప గ్రామాలకు విద్యుత్‌ సరాఫరా నిలిచిపోయింది. తీగలు వదులై రాణంపల్లి వద్ద రోడ్డుపై పడడంతో వాహనదారులు, స్థానికులు ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించారు. గంట పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ట్రాన్స్‌కో అధికారులు వెంటనే స్పందించి విద్యుత్‌ తీగలు తొలగింపచేసి రాకపోకలు పునఃరుద్ధరించారు. చిక్కడపల్లి, సులేమాన్‌నగర్‌ గ్రామాలకు రెండు గంటల్లోనే విద్యుత్‌ సరాఫరా పునఃరుద్ధరించారు. రాణంపల్లి, రాణంపల్లి క్యాంపులకు మాత్రం సాయంత్రం వరకు విద్యుత్‌ నిలిచిపోయింది.



మరమ్మతులు చేస్తున్న విద్యుత్‌ సిబ్బంది

వినతులను సత్వరమే పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్‌, అదనపు కలెక్టర్‌

సుభాష్‌నగర్‌: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్‌ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 41 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, డీఆర్డీఓ చందర్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ వెంటనే పరిష్కరించాలని కలెక్టర్‌ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి వినతులపై తీసుకున్న చర్యల గురించి ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా సమాచారం తెలియజేస్తూ, ప్రజావాణి సైట్‌లో పూర్తి వివరాలు అప్‌లోడ్‌ చేయాలని తెలిపారు.

అర్సపల్లి వీడీసీపై చర్యలు తీసుకోవాలి

కోర్టు ధిక్కారానికి పాల్పడిన నిజామాబాద్‌ నార్త్‌ తహసీల్దార్‌, చట్టాలను ఉల్లంఘిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న అర్సపల్లి గ్రామాభివృద్ధి కమిటీపై చర్యలు తీసుకోవాలని బొబ్బిలి రామకృష్ణ, రమేష్‌కుమార్‌, రమణ కుమార్‌ కోరారు. ఈమేరకు సోమవారం ప్రజావాణిలో బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ తమ ఇంటి స్థలాన్ని వీడీసీ 2011లో కబ్జా చేసేందుకు యత్నించగా, తాము కోర్టులో కేసు వేశామన్నారు. దీన్ని జీర్ణించుకోలేక వీడీసీ కుల బహిష్కరణ చేశారని ఆరోపించారు. 2018, 2019లో కోర్టు తీర్పు కూడా తమకు అనుకూలంగా వచ్చిందన్నారు. అయినా తహసీల్దార్‌ సహకారంతో కంపౌండ్‌ వాల్‌ కూల్చివేయడంతోపాటు బోర్‌వెల్‌ను ధ్వంసం చేశారని తెలిపారు. దీనిపై కూడా కోర్టు స్టేటస్‌ క్యూ ఆర్డర్‌ ఇచ్చిందన్నారు.

పోషణ్‌ అభియాన్‌ పోస్టర్ల ఆవిష్కరణ

సుభాష్‌నగర్‌: బాలింతలు, శిశువుల ఆరోగ్యం కోసం సమతుల పౌష్టికాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ పోషణ్‌ అభియాన్‌లోభాగంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆవిష్కరించారు. ఈ నెల 01 నుంచి 30 వరకు నిర్వహిస్తున్న పోషణ్‌ అభియాన్‌ కార్యక్రమం సందర్భంగా పౌష్టిక, సమతుల ఆహారం తీసుకోవాల్సిన ఆవశ్యకత గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్‌ సూచించారు. అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, ఐసీడీఎస్‌ పీడీ రసూల్‌ బీ, డీఎంహెచ్‌వో డాక్టర్‌ సుదర్శనం, ఎస్సీ కార్పొరేషన్‌ ఈడీ రమేష్‌, డీఎస్సీడీవో శశికళ పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్‌, అదనపు కలెక్టర్లు

గురుకుల క్రీడాకారులకు ఘన స్వాగతం

మోపాల్‌: చైనాలో గత నెల 29 నుంచి సెప్టెంబర్‌ 3 వరకు జరిగిన ఏషియన్‌ జూనియర్‌ అండర్‌–18 ఉమెన్స్‌ సాఫ్ట్‌బాల్‌ పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన జిల్లా గురుకుల క్రీడాకారులకు సోమవారం ఘన స్వాగతం పలికారు. డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి కళాశాలలో క్రీడాకారులు లకావత్‌ రాణి (సుద్దాపల్లి), అజ్మీర ఇందు (ఆర్మూర్‌)కు అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. జిల్లా సాఫ్ట్‌బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు వి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు భారత జట్టులో రాణించడంపై సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఒలింపిక్‌ స్థాయిలో ఎదిగేలా క్రీడాకారులను తీర్చిదిద్దుతామని అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్‌ గోదావరి మాట్లాడుతూ రాష్ట్ర సాఫ్ట్‌బాల్‌ అకాడమీ సుద్దపల్లిలో విజయవంతంగా కొనసాగుతుందన్నారు. ఇప్పటివరకు భారత జట్టుకు 15 మంది ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. ప్రధానకార్యదర్శి మర్కంటి గంగామోహన్‌, ఆర్మూర్‌ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ ధనవేని, జిల్లా స్పోర్ట్స్‌ కో ఆర్డినేటర్‌ నీరజరెడ్డి, వైస్‌ ప్రిన్సిపాల్‌ దీప్తి వాణి, వనిత, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు నల్లూరి లత, మమత, స్వప్న, అకాడమీ కోచ్‌లు మౌనిక, నరేష్‌ పాల్గొన్నారు.



స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి



వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న శితికంఠానంద

నిజామాబాద్‌ రూరల్‌: స్వామి వివేకానంద జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని రామకృష్ణ మఠం ఉపాధ్యక్షుడే శితికంఠానంద అన్నారు. మండలంలోని కాలూర్‌లో స్వామి వివేకానంద సేవా బృందం, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివేకానంద విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌, గుండారం సర్పంచ్‌ లక్ష్మణ్‌రావు, నుడా డైరెక్టర్‌ సంతోష్‌ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్‌లో ప్రతిభ



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి షటిల్‌ బ్యాడ్మింటన్‌లో జిల్లాకు చెందిన శ్రీ వైష్ణవి, వైఎస్‌ సుప్రియగా డబుల్స్‌ విభాగంలో విజేతలుగా నిలిచారు. ఈ నెల 3, 4 తేదీల్లో హైద్రాబాద్‌లో అండర్‌–17 బ్యాడ్మింటన్‌ టోర్నీ జరిగింది. ఇందులో జిల్లా క్రీడాకారులు విజేతగా నిలిచి చాంపియన్‌షిప్‌ అందుకున్నారు. బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు వాసు, కార్యదర్శి కిరణ్‌ కుమార్‌, కోశాధికారి సాయరెడ్డి, జయప్రకాశ్‌, హనుమంత్‌రావు, బాబా నర్సింహ వారిని అభినందించారు.

క్రైం కార్నర్‌

మృతదేహం లభ్యం

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): మండలంలోని కులాస్‌పూర్‌ ఊర చెరువులో గ్రామానికి చెందిన కటిక హుస్సేన్‌ మృతదేహం సోమవారం లభ్యమైంది. కటిక హుస్సేన్‌ మద్యానికి బానిసై ఏ పని చేయకుండా ఖాళీగా తిరిగేవాడు. శనివారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లడంతో కుటుంబీకులు గాలించారు. చెరువు కట్టపై సెల్‌ఫోన్‌, చెప్పులు కన్పించాయి. దీంతో చెరువులో గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం మృతదేహం చెరువులో తేలడంతో పోలీసులు పంచనామ నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్రాసుపత్రికి తరలించారు.

పలువురి అదృశ్యం

మోపాల్‌: మండలంలోని సిర్‌పూర్‌కు చెందిన గుమ్ముల భాగిర్తి అదృశ్యమైనట్లు ఎస్సై రాము తెలిపారు. భాగిర్తి బీడీలు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ నెల 2న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. ఆమె కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

నగరంలో యువకుడు..

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని గాజులపేట్‌కు చెందిన ఆకుల దేవేందర్‌(19) అదృశ్యం అయినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌ బాబు తెలిపారు. దేవేందర్‌ హైమదీ బజార్‌లోని గిఫ్ట్‌ షాప్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 4 నుంచి కనిపించడం లేదు. తల్లి మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బాలిక..

బోధన్‌రూరల్‌: ఉమ్మడి బోధన్‌ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేశామన్నారు.

సదాశివనగర్‌లో చైన్‌ స్నాచింగ్‌

సదాశివనగర్‌: సదాశివనగర్‌లో జాతీయ రహదారి పక్కన గల చెలిమెల యాదగిరి ఇంట్లో కిరాణ దుకాణం నడిపిస్తున్న వ్యాపారి భార్య లక్ష్మి మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు పుస్తెల తాడు లాక్కెళ్లారు. మాస్కులు ధరించి ద్విచక్ర వాహనంపై దుకాణానికి సిగరెట్ల కోసం వచ్చి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

టైరు పేలడంతో ఢీకొన్న కార్లు

ఇందల్వాయి: ఇందల్వాయి మండలం చంద్రాయన్‌పల్లి వద్ద జాతీయ రహదారిపై కామారెడ్డి నుంచి నిజామాబాద్‌ వైపు వెళ్తున్న కారు టైరు పేలడంతో వెనక నుంచి వస్తున్న మరో మూడు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు.. హైదరాబాద్‌కి చెందిన జబ్బార్‌ కారు టైరు పేలడంతో డివైడర్‌ని ఢీకొని ఆగిపోయింది. వెనక నుంచి వస్తున్న మెట్‌పల్లికి చెందిన శ్రీనివాస్‌, నిజామాబాద్‌కి చెందిన వరుణ్‌ అప్రమత్తమై తమ కార్లను అదుపు చేయగా వారి వెనక వస్తున్న మెట్‌పల్లికి చెందిన పవన్‌ ముందు ఉన్న వరుణ్‌ కారును ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఎవరికి గాయాలు కాలేదు. వరుణ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్‌ తెలిపారు.



ప్రమాదంలో ధ్వంసమైన కారు

ఇంకుడుగుంతలో పడి ఒకరి మృతి

రాజంపేట: ఇంకుడుగుంతలో పడి ఒకరు మృతి చెందిన ఘటన రాజంపేటలో చోటు చేసుకుంది. ఎస్సై సంపత్‌ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నల్ల మల్లేశం (51) ఆదివారం సాయంత్రం ఇంటి ఆవరణలో ఇంకుడుగుంత వద్ద కాళ్ల చేతులు కడుక్కుంటూ కాలు జారి గుంతలో పడ్డాడు. తల్లి శారద భయంతో చుట్టు పక్కల వారిని పిలిచింది. వారు వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. తల్లి శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పేద కుటుంబం కావడంతో మల్లేశం అంత్యక్రియలను సర్పంచ్‌ ఆముద సౌమ్య నాగరాజు దంపతులు తమ సొంత ఖర్చులతో నిర్వహించారు.

కల్లుబట్టిలో అనుమానాస్పదంగా ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని నాగారం కెనాల్‌ కట్ట ప్రాంతంలో గల పాత కల్లుబట్టిలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందారు. కాలనీకి చెందిన శ్యామ్‌ (35) మద్యం తాగేందుకు ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో కల్లు బట్టికి వెళ్లాడు. శ్యాం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా కల్లు బట్టిలో బోర్ల పడి మృతి చెంది ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు ఐదో టౌన్‌ పోలీసులకు సమాచారం అందించారు.

ఇసుక టిప్పర్‌ పట్టివేత

బోధన్‌రూరల్‌: బోధన్‌ మండలం నాగంపల్లి శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను బోధన్‌ రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ సోమవారం పట్టుకున్నారు. పట్టుబడిన ఇసుక టిప్పర్‌ను బోధన్‌ రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ తరలించి కేసు నమోదు చేశారు.